క్లుప్తంగా

సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో సీతారాముల ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ పురోహితులు వేద మంత్రోచ్చారణలతో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బీల సత్యనారాయణతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్ఐ సాయికృష్ణ

గంట్యాడ: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. మండలంలోని నీలావతి, లక్కిడాం జంక్షన్, నరవ, జగ్గాపురం గ్రామాల్లో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం అనారోగ్యం బారిన పడతారని అన్నారు. సైబర్ క్రైం నేరాలపై కూడా అవగాహన కల్పించారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ

దత్తిరాజేరు : మండలంలోని కోమటిపల్లి గ్రామంలో సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.13 లక్షలతో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి భూమి పూజ చేసినట్టు ఏఈ ఉపేంద్ర గురువారం తెలిపారు. గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు పడకుండా త్వరగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్టు చెప్పారు. త్వరలో వింద్యవాసి, దత్తివెంకటాపురం, మజ్జిపేట పెదమానపురం గ్రామంలో నూతన పాఠశాల భవనాల నిర్మాణానికి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

12న మెగా జాబ్‌మేళా

గజపతినగరం : ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12న గజపతినగరం పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పాల్గొనేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించి 18ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 35 బహుళజాతి కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం బాలికోన్నత పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు

గంట్యాడ: మండలంలోని గొడియాడ గ్రామ సర్పంచ్ కుబిరెడ్డి వెంకటేష్‌పై పంచాయతీ వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీలో చేపల వేలానికి సంబంధించి మూడేళ్లకు రూ.5.10 లక్షల వేలం పాట పంచాయతీ అధికారులు, సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో జరిగిందని, ఏడాదికి రూ.1.70 లక్షల చొప్పున పంచాయతీలో జమ చేసేందుకు అంగీకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో రూ.2.44లక్షలు మాత్రమే జమ చేశారని, మిగతా రూ.2.66లక్షలు జమ చేయలేదని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నిస్తామని గడిచిన ఎనిమిది నెలలుగా సమావేశాలు పెట్టడం లేదని ఆరోపించారు. దీనిపై విచారణ చేయించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు పి.సత్యవతి, డి.సంతోషి, ఆదిలక్ష్మి, కొండమ్మ ఉన్నారు.

ఇంచార్జ్‌లతో కాలక్షేపం!

మెరకముడిదాం: మండలానికి సంబంధించి పంచాయతీ విస్తరణాధికారి పోస్టు, ఉపాధి హామీ ఏపీవో పోస్టులు కొద్ది నెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు పోస్టులకు సంబంధించి గతంలో ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పని చేసిన పుష్పారావు కొద్ది నెలల కిందట ఇక్కడ నుంచి బలిజిపేట మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే ఇక్కడ ఉపాధి ఏపీవోగా పని చేసిన ఎస్.పెదఅప్పలనాయుడు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. వీరు బదిలీపై వెళ్లి ఎనిమిది నెలలు కావస్తున్నా..ఇప్పటి వరకు ఆ పోస్టులను భర్తీ చేయలేదు. అప్పటి నుంచి గర్భాం ఈవో విశ్వనాధం ఇంచార్జ్ ఈవోపీఆర్‌డీగా, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నరేంద్ర ఇంచార్జ్ ఏపీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా వీటిని పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని పలువురు సూచిస్తున్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

గజపతినగరం: కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించిందని వాటి కోసం అందుబాటులో ఉన్న గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ గురువారం తెలిపారు. రేషన్ కార్డులు లేని వారు, కార్డుల మార్పులు చేర్పులు, తొలగింపులు తదితర వాటి కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు.

భౌ.. భౌ..



గుంపులుగా తిరుగుతున్న శునకాలు

- భయపెడుతున్న శునకాల దాడులు
- మార్చి, ఏప్రిల్ నెలల్లో 137 కుక్క కాటు కేసుల నమోదు
- ఇంజక్షన్ కోసం ఆసుపత్రులకు పరుగులు



కోడూరు గ్రామంలో ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు (ఫైల్)

చీపురుపల్లి రూరల్(గరివిడి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకి జరుగుతున్న శునకాల దాడులతో ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ దాడులు చేయటంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గడిచిన మార్చి నెలలో గరివిడి, బొండపల్లి, కోనూరు ప్రభుత్వ పీహెచ్‌సీల్లో 59 కుక్క కాటు కేసులు నమోదు కాగా ఏప్రిల్ నెలలో 78 కుక్క కాటులు నమోదయ్యాయి. పదిహేను రోజుల కిందట గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఇప్పిలి పైడితల్లికి చెందిన మేకలపై దాడి చేసి మూడు మేక పిల్లలను కొరికి చంపేశాయ్. ఇదిలా ఉండగా ఇటీవల గరివిడి పట్టణంలోని కొండపాలేంకు చెందిన డాకుపల్లి తేజపై కుక్కదాడి చేయటంతో గరివిడి పీహెచ్‌సీలో ఇంజక్షన్‌లు చేయించుకున్నారు. ఆ మరుసటి రోజు విపి.రేగ గ్రామానికి చెందిన కొత్తు పాపారావు, ఈ మధ్య రోజుల్లో వరుసగా తోంద్రంగి గ్రామానికి చెందిన రాపాక దేవకుమార్, గరివిడి పట్టణానికి చెందిన వి.రమణ ఇలా ఎంతో మంది కుక్కకాటుతో ఆసుపత్రులకు పరుగులు తీసి ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇలా రోజుకు 5 నుంచి 10 మంది వరకు కుక్కకాటుకు గురవుతున్నట్టు ఆసుపత్రిలో నమోదు కాబడిన ఓపీలు వెల్లడిస్తున్నాయి. కుక్క కాటుకు గురైన కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతుండగా మరికొంత మంది ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వ్యాక్సిన్లతో వైద్యం చేయించుకుంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, యువకులు సైతం కుక్క కాటుకు గురవుతుండటంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో కుక్కలు ఉన్నాయి. వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో వాటి సంఖ్య క్రమేణా పెరిగిపోతుందనే విమర్శలు ప్రజలు నుంచి వినిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని తరిమి తరిమి కరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు పలువురు అదుపు తప్పి గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కుక్కల నియంత్రణకు పాలకులుగాని, అధికారులుగాని కనీస చర్యలు చేపట్టకపోవటంతో దాడులు పెరుగుపోతున్నాయని మండల వ్యాప్తంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడులతో ప్రాణ భయం

కుక్కలతో చిన్నారులు, వృద్ధులకు ప్రాణభయంగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. ఏమైనా తినుబండరాలను చేత పట్టుకున్న చిన్నారులపై దాడి చేస్తున్నాయి. దీంతో పసి పిల్లలు పరుగులు తీస్తూ ప్రమాదాలకు గురవుతుండటమే కాకుండా కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎం.సత్యన్నారాయణ. తోంద్రంగి గ్రామం

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ప్రస్తుతం కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఒకేసారి పదేసి కుక్కలు వీధుల్లోకి రావటం, మేడలపైకి ఎక్కటం చేస్తున్నాయి. తరిమి వేయటానికి వెళ్తే.. తిరగబడి మీదకు వస్తున్నాయి. చిన్న పిల్లలపై దాడులు చేస్తే ప్రాణాలు వదిలేయవలిసిందే. ఇటీవల కుక్కలు దాడులు చేసి మా గూడెంలో ఉన్న మూడు మేక పిల్లలను చంపేశాయి. మేక పిల్లలు మరణించంతో కొంత ఆర్థికంగా నష్టపోయాం. పంచాయతీల అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ఐ.పైడితల్లి.కోడూరు గ్రామం

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ఇంగిలాపల్లిలో మాట్లాడుతున్న మండల పర్యవేక్షకులు శివాజీ

దత్తిరాజేరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల పర్యవేక్షకులు శివాజీ అన్నారు. ఇంగిలాపల్లి, పెదమానాపురం, వి.కృష్ణాపురంలో సమాచార హక్కు చట్టంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో నిర్వహించే ఏ పని గురించి అయినా ప్రతి పౌరుడు అధికారులను అడిగి సమాచారం తెలుసుకోవచ్చని అన్నారు. గ్రామ సమాచారం నుంచి మండల, జిల్లా సమాచారంతో పాటు ఏ సమాచారమైన పౌరులు అడిగిన వెంటనే ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ కృష్ణారావు

చీపురుపల్లి: పిల్లల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సైకాలజిస్టు డా.మిరియాల కృష్ణారావు సూచించారు. జాతీయ పిల్లల మానసిక ఆరోగ్య వారోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో మానసిక సవాళ్లు ఉంటాయని వాటిని ఎదుర్కొనడంలోనే జీవితం ఉంటుందని స్పష్టం చేశారు. పిల్లల్లో భావోద్వేగాలను ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ఆలోచనలు, అభిప్రాయాలను గౌరవిస్తూ వారిలో అవగాహన కల్పించడంలో తల్లిదండ్రులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. పిల్లలను ప్రేమతో పెంచాలన్నారు. పిల్లలు అభిప్రాయాలకు తప్పనిసరిగా గౌరవం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ రెడ్‌క్రాస్ డే



రెడ్‌క్రాస్ డే నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

శృంగవరపుకోట : పట్టణంలోని కోలపర్తి ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం వరల్డ్ రెడ్‌క్రాస్ డే నిర్వహించారు. రెడ్‌క్రాస్ పితామహులు కో ఫౌండర్ హెంద్రీ దునత్ చిత్రపటానికి ఎస్.కోట రెడ్‌క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డా.వరలక్ష్మి తదితర సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డా.వరలక్ష్మి మాట్లాడుతూ హెంద్రీ దునత్ పుట్టిన రోజును వరల్డ్ రెడ్‌క్రాస్ డేగా 1948నుంచి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా ఎంసీ మెంబర్ డి.సూర్యారావు మాట్లాడుతూ లక్షలాది మంది రెడ్‌క్రాస్‌లో పని చేస్తూ సేవలందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఎ.మల్లేశ్వరరావు, కోశాధికారి శ్రీనాధు వెంకన్నబాబు, డాక్టర్ గణేష్, డి.పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనుల్లో కదలిక

- ఎట్టకేలకు గాడర్ పనులు
- ఇంకా మిగిలిన అనలైన బ్రిడ్జి పనులు



ఆర్‌వోబీ పనుల్లో భాగంగా క్రేన్లు సహాయంతో గాడర్ పనులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. దాదాపు ఏడాది కాలంగా ఎలాంటి పురోగతి లేని ఈ పనులు తాజాగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో గత కొంత కాలంగా నిలిచిపోయిన ఈ పనుల్లో భాగంగా రైల్వే అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ సమక్షంలో గురువారం గాడర్ పనులు నిర్వహించారు. అతి పెద్ద క్రేన్లు సహకారంతో హౌరా – చెన్నై ప్రధాన రైల్వే లైన్‌పై గాడర్ పనులు చేపట్టారు. ఇందుకోసం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తొలుత అధికారులు ప్రణాళికలు రచించినప్పటికీ ఆ సమయంలో కుదరకపోవడంతో సాయంత్రం 5 గంటల తరువాత గాడర్ లిఫ్టింగ్ కోసం సమయాన్ని నిర్దేశించారు. అయితే సాయంత్రం 6 గంటల తరువాత క్రేన్ సహాయంతో గాడర్ ఏర్పాటు పనులు పూర్తి చేశారు. దీని కోసం హౌరా – చెన్నై ప్రధాన లైనులో గంట సమయం పాటు రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. ఇదిలా ఉండగా ఇంకా అసలైన బ్రిడ్జి ఏర్పాటు పనులు మిగిలి ఉన్నాయి. దీని కోసం రైల్వే అధికారులు ఈ నెల 12న ప్రధాన బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు సమయం నిర్దేశించినట్లు తెలుస్తోంది. అయితే గురువారం గాడర్ పనులు పూర్తయిన నేపథ్యంలో ప్రధాన బ్రిడ్జి ఏర్పాటు పనుల కోసం పూర్తి స్థాయిలో రైళ్లు, గూడ్సులు నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే హౌరా – చెన్నై ప్రధాన లైను కావడంతో అత్యున్నత స్థాయిలో అనుమతులు పొంది ఈ నెల 12న పూర్తి స్థాయిలో రైల్లు, గూడ్సులు రాకపోకలు నిషేధించి ప్రధాన బ్రిడ్జిను అమర్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్ల: మండలంలోని అచ్చుతపురం ఫీడర్ పరిధిలో చోడవరం, పెనుబర్తి, చుక్కపేట, చింతపల్లిపేట, గంగిరెడ్ల పేట, అచ్చుతపురం, తెట్టంగి, పోలాయవలస, గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ నారం నాయుడు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ వైర్లుకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరంలో...

గజపతినగరం : గజపతినగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మలు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు బొబ్బిలి డివిజన్ విద్యుత్ కార్యనిర్వాహక ఇంజినీరు ఎ.అనంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గజపతినగరం, ఎం.వెంకటాపురం, పురిటిపెంట, పిడిశీల, దోశపాలెం, సీతారామపురం, శ్రీరంగరాజపురం, మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడు పేట, ఎం.గుమడాం, గంగచోళ్ల పెంట, పట్రువాడ, కొత్త బగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

శ్యామలదేవి పేరంటాల ఆలయంలో పూజలు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో శ్యామలదేవి పేరంటాల ఆలయంలో గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి : అన్ని అర్హతలు ఉండి పెట్టుబడి సాయం అందని రైతులు సంబంధింత రైతు సేవా కేంద్రాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లిఖార్జునరావు గురువారం తెలిపారు. దీని కోసం వీఏఓలకు వన్‌బీ, ఆధార్ కార్డు, రేషను కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబరు వివరాలను అందజేసి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు.

'విజయం కోసం..' పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని మోక్ష విద్య యోగమందిర్ ఆధ్వర్యంలో ఎంసెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు విజయానికి మార్గం అన్న స్వామి వివేకానంద ఉత్తేజిత భోధనలతో కూడిన పుస్తకాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సి.హెచ్.ఆర్.కె.ప్రసాద్, భాస్కర్, మోక్షవిద్య యోగమందిర్ వ్యవస్థాపకులు శీలా కోటేశ్వరరావు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ రూపొందించిన పుస్తకం పరీక్షల వరకే కాకుండా, జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని అధిగమించి ఎదిగేందుకు దోహదం చేస్తుందన్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. మోక్షవిద్య యోగ మందిర్ వ్యవస్థాపకుడు కోటేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు.

వృథాగా ప్రభుత్వ భవనాలు



మెరకముడిదాం మండల కేంద్రంలో సచివాలయాన్ని ఆనుకొని ఉన్న ఈ చిత్రం ఒకప్పటి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం. దీన్ని ఎత్తేయడంతో ఈ భవనం అప్పటి నుంచి ఇలా వృథాగా పడి ఉంది. దీంతో ఈ భవనం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. రూ.లక్షల విలువైన ప్రభుత్వ భవనాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు సూచిస్తున్నారు. – మెరకముడిదాం

తుడుపులమ్మ ఆలయంలో హోమాలు



వేపాడ మండలంలోని నీలకంఠరాజపురంలో నూతనంగా నిర్మించిన తుడుపులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో బుధ, గురు వారాల్లో ఊరేగింపు, హోమాలు, క్షీరాదివాసం, జలాదివాసం, ధాన్యాదివాసాలు పూర్తి చేసుకున్నాయి. శుక్రవారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు పండితులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. – వేపాడ

పూల సోయగం





వేపాడ మండలం వల్లంపూడి నుంచి దబ్బిరాజుపేట వెళ్లే మార్గంలో తంగేడు పూల సోయగం పాదచారులకు, వాహన చోదకులకు కనువిందు చేస్తున్నాయి. మండుటెండలో అటుగా ప్రయాణించే వారు వీటి నుంచి వీస్తున్న చల్లని గాలులను ఆస్వాదిస్తున్నారు. తంగేడు చెట్లకు ఎరుపు, లేత ఆకుపచ్చ రంగుల పూలు పూసి ఆకట్టుకుంటున్నాయి. – వేపాడ

జూన్ నెలాఖరు నాటికి రెండో విడత రీసర్వే పూర్తి



గొల్జాం గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలిస్తున్న రమణమూర్తి

- సర్వే శాఖ డీఎస్ఎల్‌వో రమణమూర్తి
- మొదటి విడతలో 27 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి
- గొల్జాం గ్రామంలో సర్వే పరిశీలన

లక్కవరపుకోట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రీసర్వే ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెండో విడత రీసర్వే కార్యక్రమాన్ని జూన్ నెల చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డుల అధికారి కె.రమణమూర్తి సూచించారు. మండలంలోని గొల్జాం గ్రామంలో మండల సర్వేయర్ చల్లా వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల నిర్ధారణ, వర్గీకరణ, సర్వే చేసే పద్ధతులను సూచించారు. సర్వే సమయంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొదటి విడతగా 27 గ్రామాలను ఎంపిక చేసి సర్వే పనులను పూర్తి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆయా రెవెన్యూ గ్రామాలకు చెందిన రికార్డులను తయారు చేస్తున్నామన్నారు. అలాగే రెండో విడతలో 48 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ముమ్మరంగా సర్వే పనులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సర్వేను వచ్చే నెల చివరి నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఎటువంటి తప్పులు లేకుండా సమగ్రంగా సర్వే నిర్వహించి రికార్డులను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయరులు పాల్గొన్నారు.

నేత్ర, గుండె వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని వాసవీనగర్‌లో ఉచిత నేత్ర – గుండె వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. గాంధీ బ్లడ్ బ్యాంకు డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌రవూఫ్ పుట్టిన రోజు సందర్భంగా శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన ఐదుగురిని గుర్తించారు. వీరిని విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తామని చెప్పారు. పలువురికి మధుమేహం, ఈసీజీ, బీపీ పరీక్షలు విజయనగరం తిరుమల ఆసుపత్రి సిబ్బంది నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కాంద్రేగుల సన్యాసినాయుడు, వెంకటరావు, వైద్య సిబ్బంది తమ వంతు సేవలు అందించారు.